ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కుషాయిగూడ: ఆటోడ్రైవర్లు, వ్యాపారులు విధిగా ట్రాఫిక్ నింబంధనలు పాటించి సహకరించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సైదయ్య, రామలక్ష్మణ్‌రాజ్‌లు అన్నారు. బుధవారం ఈసీఐఎల్ కూడలిలో ఆటోడ్రైవర్లు, యూనియన్ ప్రతినిధులకు ట్రాఫిక్ నింబంధనలపై అవగాహన కల్పించారు. సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌లను అడ్డగించడం, ఇష్టానుసారంగా ఆటోలు పార్కింగ్ చేస్తే జరిమానా విధిస్తామన్నారు. కుషాయిగూడ బస్‌స్టాప్‌లో పూలు, పండ్ల వ్యాపారులతో మాట్లాడారు. షాపులకు వచ్చేవారి వాహనాలు బస్‌స్టాప్‌లో నిలిపితే జరిమానాలు తప్పవన్నారు. ఆటోడ్రైవర్లు, వ్యాపారులు ట్రాఫిక్ రూల్స్‌ను అనుసరించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సహకరించాలని కోరారు. నింబంధనలు అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను అధికారులు, నాయకులతో కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జగదీష్‌గౌడ్, రాముయాదవ్, అమీనుద్దీన్, భాగ్యనంద్‌రావు, ఉస్మాన్, వంశీముదిరాజ్, సంతోష్‌నాయుడు, జోగు శ్రీనివాస్, అరుణ్‌గౌడ్, శైలేందర్ తదితరులున్నారు.

సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం



వాణినగర్‌లో వీధి నెంబర్ల సూచికల బోర్డును ప్రారంభిస్తున్న రాముయాదవ్

గౌతంనగర్: సమష్టి కృషితోనే కాలనీ సమస్యలు పరిష్కరించవచ్చని బీఆర్‌ఎస్ నేతలు మేకల రాముయాదవ్ అన్నారు. వాణినగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీధి నెంబర్ల సూచికల బోర్డును కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిద్దయ్య, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావులు మాట్లాడుతూ.. మొత్తం కాలనీలో 4 వీధులు ఉన్నాయని, మొత్తం వీధులకు 40 సూచికల బోర్డులను తయారుచేసి ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కాప్రా: నిరంతరాయంగా సేవా కార్యక్రమాలను చేపడుతూ పేదలను ఆదుకోవడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ వైస్ గవర్నర్ ఇన్నారెడ్డి అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కమలానగర్ స్ఫూర్తి 20వ ఇన్‌స్టాలేషన్‌ను ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ ఎంవీఆర్. కన్వెన్షన్‌లో నిర్వహించారు. అనంతరం దివంగత మణిపాల్‌రెడ్డి కుమార్తె కాశ్యపిరెడ్డి తన మొదటి జీతాన్ని తండ్రి లేని నిరుపేదలైన 7వతరగతి విద్యార్థులకు అందజేశారు. డిస్ట్రిక్ వైస్ గవర్నర్ కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజేష్, రమాదేవి, అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి రాజేంద్రప్రసాద్, మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

అవగాహన కల్పిస్తున్న యాంటీ లార్వా ఆపరేషన్ టీమ్



కాప్రా: వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాప్రా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు యాంటీ లార్వా ఆపరేషన్స్‌ను విస్తృతంగా చేపట్టారు. వైరల్ ఫీవర్స్, సీజనల్ వ్యాధులపై స్కూళ్లు, కాలేజీలు, కాలనీల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఎంటమాలజీ, శానిటేషన్, హెల్త్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఈ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

మొదటి దశగా విద్యార్థులకు..

సీజనల్ వ్యాధులపై మొదటగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాప్రా సర్కిల్‌లో ఎంటమాలజీ ఏఈ రమేష్ ఆధ్వర్యంలో 136 ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, 8 కాలేజీల్లో విద్యార్థులకు యాంటీ లార్వా ఆపరేషన్‌పై ఎగ్జిబిషన్ నిర్వహిస్తూ.. వివరిస్తున్నారు. మన ఇళ్లల్లో ఉండే నిరుపయోగంగా ఉన్న వస్తువుల్లో నీరు నిల్వ ఉండటంతో లార్వా వృద్ధి చెంది, దోమల వ్యాప్తి చెందుతుందన్నారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. వ్యర్థాలను తొలగించి ఇంట్లో ఉంటే ఫ్లవర్‌వాజ్‌లలో నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయడంతో వీటిని నిర్మూలించవచ్చని వివరించారు.

రెండో దశలో కాలనీలకు..

రెండో దశలో కాలనీల్లో అవగాహన కార్యక్రమం చేపడుతున్నారు. 80 మందితో కూడిన ఈ యాంటీలార్వా టీమ్స్ 20 రోజుల పాటు కాప్రా సర్కిల్‌లోని అన్ని కాలనీల్లో ఈ అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. ఒక్కో టీమ్‌లో ఇద్దరు ఎంటమాలజీ సిబ్బంది, శానిటేషన్ విభాగం నుంచి ఒకరు, హెల్త్ డిపార్ట్‌మెంట్ నుంచి మరొకరు ఉంటారు.

- మొత్తం 40 బృందాలు ఆయా టీమ్‌కు కేటాయించిన కాలనీల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎక్కువగా బస్తీల్లో ఈ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో వాటిపై జీహెచ్‌ఎంసీ సిబ్బంది దృష్టి సారించారు.
- కాప్రా సర్కిల్‌లో దాదాపు 40 నుంచి 60 వరకు బస్తీలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతం చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం..

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్‌లోని గాంధీ గిరిజన బస్తీలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులను నివారించేందుకు అవగాహన కల్పించారు. బుధవారం కార్పొరేటర్ చేతనాహరీష్ హాజరై మాట్లాడుతూ.. దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తాచెదారం, పూలకుండీలు, కొబ్బరి చిప్పలు, ఇతర వస్తువులు తొలగించాలన్నారు. శానిటేషన్ డీఈ చందన, ఎంటమాలజీ ఏఈ నరేష్‌రెడ్డి, బీజేపీ నేతలు ఎల్లాచారి, ప్రవీణ్, రమేష్‌నాయక్, కొండేరు స్రవంతి, స్థానిక మహిళ సమాఖ్య అధ్యక్షురాలు బానోత్ ఉమా, సరిత, స్వాతి, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమలతో ఇబ్బంది..

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరానెహ్రూనగర్, లక్ష్మీనర్సింహస్వామినగర్, గోపాల్‌నగర్, జ్యోతినగర్, మిర్జాలగూడ, మల్లికార్జుననగర్ తదితర ప్రాంతాల్లో దోమలు సాయంత్రం 6 దాటితే దోమలు బెడద అధికమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దోమల నివారణకు ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

మరిన్ని కార్యక్రమాలు చేపడతాం



కాప్రా సర్కిల్‌లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీలార్వా ఆపరేషన్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రతి స్కూల్, కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 136 స్కూళ్లు, 8 కాలేజీల్లో అవగాహన కల్పించి, కాలనీల్లోనూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపడతాం.

– రమేష్, ఎంటమాలజీ ఏఈ

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు





కుషాయిగూడ పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మల్కాజిగిరి: తొలి ఏకాదశి పర్వదినాన్ని మల్కాజిగిరిలో ఘనంగా నిర్వహించారు. ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో మూలవిరాట్‌కు 108 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రామంతాపూర్: శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి గోకుల్‌నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వెంకట్‌రెడ్డినగర్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి, నెహ్రూనగర్‌లోని పోచమ్మ ఆలయాల్లో బుధవారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. భక్తులు ఉదయం నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు..

కుషాయిగూడ: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా చర్లపల్లి, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్లలోని ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ఆలయాల్లో భక్తులు పెద్దఎత్తున బారులు తీరారు. కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ సంకూరి శ్రీనివాస్‌గౌడ్, ఈవో మటం వీరేశం తెలిపారు. వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసచారి, రఘుగౌడ్ స్వామివారి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



సత్యనారాయణ స్వామి ఆలయంలో..

ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి



మేయర్‌గా బాధ్యతలు చేపడుతున్న అజయ్‌యాదవ్

బోడుప్పల్: ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ మేయర్‌గా స్రవంతిగౌడ్‌లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అజయ్‌యాదవ్ మాట్లాడుతూ.. చిరువ్యాపారులకు ఇబ్బందిగా మారిన తైబజారు రద్దుపై తొలి సంతకం చేసినట్లు వివరించారు. అన్ని డివిజన్లలో పర్యటించి స్థానిక సమస్యల గుర్తించి, తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో కలిసి కృషి చేస్తామన్నారు. రహదారులు, తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, చెత్త నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ కమిషనర్ రామలింగం, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, బోడుప్పల్ మాజీ సర్పంచ్ తోటకూర లక్ష్మి యాదవ్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను ప్రారంభించండి



చర్లపల్లి, రాంపల్లి రోడ్డును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్. ప్రభాకర్

కుషాయిగూడ: గుంతలమయంగా మారిన చర్లపల్లి–రాంపల్లి రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్‌ఎస్. ప్రభాకర్ డిమాండ్ చేశారు. అధ్వాన్నంగా మారిన చర్లపల్లి–రాంపల్లి రోడ్డును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగించడంతో పాటుగా ఔటర్ రింగ్ రోడ్డుకు వెళ్లే వాహనదారులు సహితం నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రద్దీగా ఉండే ఈ రోడ్డు పనులను ప్రారంభించాలని లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. స్థానిక బీజేపీ నేతలు నాదం, కొమ్ము నర్సింగరావు, నాగమణి, సురేష్, మహేశ్‌శర్మ, బాలరాజు, ఆనంద్‌గౌడ్, గణేష్‌గౌడ్, రాంబాబు, విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

బోనాల నూతన ఉత్సవ కమిటీ

రామంతాపూర్: బోనాల ఉత్సవ కమిటీని రామంతాపూర్ గ్రామ పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బుర్ర రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా బొడ్డుపల్లి రాజేష్ ఉపాధ్యక్షుడిగా వల్ల సత్యనారాయణ, కోశాధికారిగా ముత్యాల జంగయ్య, గౌరవ సలహాదారులుగా సుర్వి భీష్మాగౌడ్, ముత్యాల నరసింహ, బొడ్డుపల్లి శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, బొడ్డు బాలయ్యయాదవ్, సర్వ సత్తయ్యయాదవ్, మురళీగౌడ్ తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బోనాల పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని తీర్మానించారు.

ఘనంగా 'సీతల' పండుగ వేడుకలు

బోడుప్పల్: చెంగిచర్లలోని చింతల చెరువు పక్కన ఉన్న సీతల భవాని ఆలయంలో బుధవారం బంజారాలు సీతల పండుగ వేడుకలను వైభవంగా నిర్వహించారు. బంజారాలు సుకుటుంబంగా వారి పూర్వికుల ఆచార, సంప్రదాయాలను కొనసాగిస్తూ.. ఈ పండుగను నిర్వహించారు. కమిటీ సభ్యులు ధరావత్ మంజిలాల్, బానోతు రవీందర్, అజ్మీరా గణేష్, అంగోత్ వెంకటేష్, భూక్యా జీవన్, మురళి, రవీందర్, రవి, అంగోత్ రవి, శ్రీనివాస్, బద్రు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

అల్వాల్: వెంకటాపురం డివిజన్ బృందావన్ చిట్టమ్మనగర్ కాలనీలో వినాయక మండప నిర్మాణానికి బుధవారం కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్ భూమిపూజ చేశారు. కాలనీవాసులు సుదర్శన్, బుద్దారెడ్డి, నాయకులు విజయశేఖర్, ప్రకాష్‌గౌడ్, జనార్దన్, మోసిన్, ఫయాజ్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన హన్మకొండ సుధాకర్(44) 6 నెలలుగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. మద్యానికి బానిసైన అతడు మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో మౌలాలి–అమ్ముగూడ రైల్వేస్టేషన్ల మధ్య గూడ్స్ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

వ్యర్థాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

కుషాయిగూడ: కుషాయిగూడలోని పలు వీధుల్లో పిచ్చిమొక్కలు, చెత్త చెదారంతో అపరిశుభ్రంగా ఉన్నాయని, 'వ్యర్థాలను తొలగించండి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి స్పందించిన శానిటేషన్ సిబ్బంది బుధవారం వీధులను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి, చెత్తను ఎత్తివేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గరుడాల్వార్‌కు వెండి కవచం..




మల్కాజిగిరి: మల్కాజిగిరి ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో గరుడాల్వార్‌కు వసంతపురి కాలనీకి చెందిన భక్తుడు వెంకటసుబ్రహ్మణ్యం సుమారు 3.9 కిలోల వెండితో తయారు చేసిన వెండి కవచాన్ని విరాళంగా అందజేశారు. తొలి ఏకాదశి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి వెండి కవచాన్ని అలంకరించారు. ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు, ఆయనను స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించారు.

రేషన్ బియ్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మల్కాజిగిరి: రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఆహార పదార్థాలుగా విక్రయిస్తున్న వ్యక్తిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. వేంకటేశ్వరనగర్‌కు చెందిన చీమకోటి శ్రీనివాస్ శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ ద్వారా ఆహర పదార్థాలను ప్యాకెట్ల ద్వారా విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో మల్కాజిగిరి పోలీసులు దుకాణంపై దాడి చేసి 400 కిలోల రేషన్ బియ్యం, 500 ప్యాకెట్ల బియ్యం రవ్వ , 50 రాగిపిండి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

యువకుడి అదృశ్యం



విశ్వతేజ


అల్వాల్: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాయుపురిలోని సుమంగళి ఫంక్షన్‌హాల్ దగ్గర నివాసం ఉండే కంకనల విశ్వతేజ అలియాస్ సన్నీ(19) భవన్స్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 16న రాత్రి 9 గంటలకు తన స్నేహితుడి ఇంటికి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి కృష్ణవేణి నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మొహర్రం సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఓల్డ్ మల్కాజిగిరిలోని చిల్లా, హైదర్‌నగర్‌లోని పీర్ల చావిడి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రావుల అంజయ్య, రాముయాదవ్, కోటేష్, ఉపేందర్ తదితరులున్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొహర్రం శతాబ్దాల క్రితమే హక్కుల కోసం చేసిన త్యాగాలను గుర్తు చేస్తుందన్నారు.

మల్లాపూర్: నాచారం, మల్లాపూర్‌లో మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ.. భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండాలను ఏర్పాటు చేసి పీర్లను ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పీర్లకు కుడుకలు, దట్టీలు సమర్పించారు.



హైదర్‌నగర్‌లో పీర్ల ఊరేగింపులో..